క్లుప్తంగా

శంకుస్థాపన

జూలూరుపాడు: కాకర్ల గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ బానోత్ రమాదేవితో కలిసి ఎంపీటీసీ సభ్యుడు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చీమలపాటి కొండయ్య, సెక్రటరీ భూక్యా నానిబాబు, మాజీ ఎంపీటీసీ పదిమల రాంబాబు, పీఆర్ వర్క్ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, గ్రామస్తులు నవీన్, చెవుల సుబ్బయ్య, చంద్రగిరి రమేష్, కంపసాటి నాగేశ్వరరావు, బ్రహ్మం పాల్గొన్నారు.

రక్తపరీక్షలు చేయించుకోండి

పాల్వంచరూరల్: జ్వరం వచ్చిన ప్రతిఒక్కరూ రక్తపరీక్షలు చేయించుకోవాలని జిల్లా సహాయ మలేరియాధికారి గొంది వెంకటేశ్వర్లు సూచించారు. సీతారాంపాడు గిరిజన గ్రామాన్ని బుధవారం సందర్శించారు. గ్రామంలో నలుగురు మలేరియా జ్వరంతో ఉండడాన్ని గుర్తించి వైద్యపరీక్షలు నిర్వహించారు. దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. అనంతరం గిరిజనులతో సమావేశం నిర్వహించి మలేరియా జ్వరాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో నీటినిల్వలు లేకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

చీరల పంపిణీ

సుజాతనగర్: వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో సంక్రాంతి కానుకగా సుజాతనగర్‌లో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు గడిపల్లి కవిత మాట్లాడుతూ.. వైఎస్సార్ సంక్షేమ పాలన మళ్లీ రావాలంటే షర్మిలక్కతోనే సాధ్యమన్నారు. ముస్లింలకు 12% రిజర్వేషన్ ఇస్తామని, డబుల్ బెడ్ రూం ఇళ్లు పొడుపట్టాలు, వృద్ధులకు పెన్షన్లు, ఇంటికో ఉద్యోగం ఇస్తామని అబద్ధపు హామీలు ఇస్తూ కాలం గడుపుతున్న కేసీఆర్‌ను గద్దెదించాలన్నారు. కార్యక్రమంలో షేక్ ఖలీల్‌పాషా, ఆదప నవీన్‌కుమార్, గంగుల సాయిరెడ్డి, బండి నాగరాజు, నల్లగొర్ల గోపాల్‌రావు, మండే సత్యనారాయణ, ఎండీ బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీలో చేరిక..

కాంగ్రెస్ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గ మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ షేక్ అజ్మత్ పాషా బుధవారం వైఎస్సార్ టీపీలో చేరారు. వైఎస్సార్ టీపీ రాష్ట్ర నాయకురాలు గడిపల్లి కవిత అజ్మత్ పాషాకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సింగరేణి క్యాలెండర్లు ఆవిష్కరణ

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా వార్షిక క్యాలెండర్లను జీఎం షాలేమురాజు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ సాధిస్తున్న బహుముఖప్రగతి, సంక్షేమానికి సింగరేణి వార్షిక క్యాలెండర్లను రూపొందించారని గుర్తుచేశారు. ఏరియాలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి క్యాలండర్లు పంపిణీ చేస్తామన్నారు. అధికారుల సంఘం అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, ఎంటీ పర్సనల్ సాయిస్వరూప్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జూలూరుపాడు: సాయిరాంతండా గ్రామ సమీపంలో తల్లాడ–కొత్తగూడెం ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. భేతాళపాడు గ్రామపంచాయతీ టాక్యాతండాకు చెందిన బానోత్ బిక్కు బైక్‌పై జూలూరుపాడులో పని ముగించుకొని తిరిగి స్వగ్రామం వెళుతున్నాడు. ఈ క్రమంలో జూలూరుపాడు వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొట్టింది. బిక్కుకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుణ్ని కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గులాబీమయమైన ‘గూడెం’

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు గురువారం కొత్తగూడెం వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం ప్రధాన సెంటర్లలో తోరణాల బ్యానర్లు అలంకరించినట్లు వివరించారు. సుమారు 14 కిలోమీటర్లు భారీ కటౌట్లు, తోరణాలు, బీఆర్ఎస్ జెండాలు ఏర్పాటు చేశారు. కలెక్టర్ కార్యాలయం ప్రారంభానికి భారీగా జన సమీకరణ, వివిధ రంగాల కళాకారులతో కలెక్టరేట్ వద్ద నృత్యాలు, డప్పు వాయిద్యాలు, కోలాటం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు

కొత్తగూడెం ముస్తాబు...

కలెక్టరేట్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కొత్తగూడెం వస్తున్న నేపథ్యంలో బుధవారం కొత్తగూడెం జిల్లా కేంద్రమంతా కూడా గులాబీమయం అయింది. ఎటుచూసినా బీఆర్ఎస్ పార్టీ జెండాలు, ఫ్లెక్సీలతో నిండిపోయింది. పోస్టాఫీసు సెంటర్ మొదలుకొని నూతన కలెక్టరేట్ కార్యాలయం వరకు కూడా రోడ్డుకు ఇరువైపులా జెండాలు, ఫ్లెక్సీలు, స్వాగత తోరణాల అలంకరణలు, డివైడర్ల మధ్య పార్టీ జెండాలు, ప్రధాన కూడళ్లు అయిన పోస్టాఫీసు సెంటర్ సర్కిల్, బస్టాండ్ సెంటర్ సర్కిల్ అంతా కూడా గులాబీ జెండాలతో నిండిపోయింది. మరో వైపు డివైడర్లకు, మెర్రెడు వాగు బ్రిడ్జికి రంగులు వేశారు.



పాల్వంచ: కొత్తగూడెం- పాల్వంచ జాతీయ రహదారి



కొత్తగూడెంఅర్బన్: బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం

పాల్వంచ: పాల్వంచ- కొత్తగూడెం సరిహద్దులో నిర్మాణం జరుపుకున్న మెడికల్, నర్సింగ్ కళాశాల, కలెక్టరేట్ నూతన భవన నిర్మాణాల ప్రారంభోత్సవానికి నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తున్న తరుణంలో బీసీఎం జాతీయ రహదారి గులాబీమయంగా మారింది. కొత్తగూడెం నుంచి పాల్వంచ కలెక్టరేట్ వరకు రోడ్డు పొడువునా బీఆర్ఎస్ పార్టీ గులాబీ జెండాలు, తోరణాలు, భారీ ఎత్తున ఫ్లెక్సీలు అడుగడుగునా స్వాగతం పలికే విధంగా ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఎస్పీ వినీత్ ఆధ్వర్యంలో సీఎం పర్యటన పరిధిలో మొత్తం అడుగడుగునా భద్రతా ఏర్పాట్లు చేశారు. మున్సిపాలిటీ అధికారులు పార్కింగ్ కోసం కలెక్టరేట్ చుట్టుపక్కల ఉన్న అన్ని ఖాళీ స్థలాలు శుభ్రం చేశారు.

గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ప్రస్తుతం ఉన్న గుర్తింపు సంఘం కాలపరిమితి అయిపోయిందని, మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు తీర్పు ఇచ్చినా సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించ లేదని, వెంటనే ఎన్నికలు నిర్వహిస్తారా లేదా ధర్నా చేయమంటారా అని ఏఐటీయూసీ నాయకులు డీవైసీఎల్పీ శ్రీనివాసులను నిలదీశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సింగరేణిలో ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలిచ్చినా సింగరేణిలో కదలిక లేదని వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వాసిరెడ్డి సీతారామయ్య, బోసు, బాలరాజు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణులంతా ఖమ్మం తరలిరండి



ఇల్లెందు: హాజరైన కార్యకర్తలు, నాయకులు



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

ఇల్లెందు: దేశ చరిత్రను మార్చే తొలి అడుగు ఖమ్మం నుంచే ప్రారంభం అవుతుందని, నాడు గాంధీతో అడుగులు వేసినట్లే నేడు కేసీఆర్‌తో అడుగులు వేయాలని, ఇదో తీపి గుర్తుగా మిగిలిపోతుందని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. బుధవారం ఇల్లెందులోని ఐతా ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే హరిప్రియ అధ్యక్షతన జరిగిన సీఎం సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు ఖమ్మంలో ఉద్యమ నాయకుడు కేసీఆర్‌ను అరెస్టు చేసి జైలులో బందిస్తే కొంతమంది తనతో పాటు ఈ ఉద్యమంలో నేటి సీఎం కేసీఆర్‌తో అడుగులు వేసిన వారు ఉన్నట్లే రేపటి భారత్ రాష్ట్ర సమితి అధికారంలోకి వస్తే దేశ రాజకీయాలను శాసించిన సీఎం కేసీఆర్ వెంట తాము ఉన్నామనే తీపి గుర్తులు ఎప్పటికీ మిగిలిపోతాయని ప్రతీ బీఆర్ఎస్ కుటుంబ సభ్యుడు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, కొత్తగూడెంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు, సమీకృత కలెక్టరేట్ల ఏర్పాటు, ఎమ్మెల్యేలకు క్యాంపు కార్యాలయాలు లాంటి ఎన్నో సంక్షేమ అభివృద్ధి పథకాల అమలుకు తెలంగాణ సీఎం కేసీఆర్ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని తెలిపారు.

ఇల్లెందురూరల్: ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహిస్తున్న బహిరంగ సభను విజవంతం చేయాలని ఎమ్మెల్సీ తాతా మధు, టీఎస్ఎంఎస్ఐడీఎస్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని సుభాష్‌నగర్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా ఉద్యమాల ఖిల్లా అని నాడు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఖమ్మం జిల్లా ప్రజలు నేడు దేశ ప్రజల తలరాతను మార్చే బీఆర్ఎస్‌ను కూడా ఆదరిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఢిల్లీ గడ్డపై గులాబీ జెండా ఎగురవేసేందుకు బాటలు వేసేలా కేసీఆర్ సభను విజయవంతం చేయాలని కోరారు.

టేకులపల్లి: సీఎం కేసీఆర్ సభకు లక్షలాదిగా హాజరై విజయవంతం చేయాలని ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ముత్యాలంపాడు రైతువేదికలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు, బూత్ లెవెల్ నాయకులతో ఏర్పాటు చేసిన సీఎం సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మనమంతా బీఆర్ఎస్ కుటుంబం. ఆ వర్గం.. ఈ వర్గం.. అని కాకుండా అందరూ ఐక్యంగా మండలానికి 10వేలు చొప్పున ఖమ్మం సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని, 100 సీట్లకు పైగా గెలుస్తామని ఇందులో ఇల్లెందు ఒకటని ధీమా వ్యక్తం చేశారు. మెడికల్ సైన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు కేసీఆర్‌తో పాటు ముగ్గురు సీఎంలు, ఇద్దరు మాజీ సీఎంలు హాజరవుతున్నారని, ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు.

నేడు ముగ్గుల పోటీలు

కొత్తగూడెంటౌన్: విశ్వహిందూ పరిషత్ కొత్తగూడెం ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. గురువారం మధ్యాహ్నం శ్రీ వివేకానంద విద్యాలయంలో నిర్వహించనున్న ఈ పోటీలను విజయవంతం చేయాలని నగరశాఖ అధ్యక్షుడు వందనపు శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వివరాలకు 9963284866 లో సంప్రదించాలని కోరారు.

ఎంపీడీఓగా వెంకటేశ్వరరావు




జూలూరుపాడు: జూలూరుపాడు ఎంపీడీఓగా కేఎస్ వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. జూలూరుపాడు మండల ప్రజా పరిషత్ సూపరింటెండెంట్ తాళ్లూరి రవి ప్రస్తుతం ఎంపీడీఓగా పని చేస్తున్నారు. నాగకర్నూల్ జిల్లా వెల్లందండ ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వరరావు బదిలీపై జూలూరుపాడుకు వచ్చారు. దీంతో రవి తిరిగి స్థానిక మండల ప్రజాపరిషత్ సూపరింటెండెంట్‌గా కొనసాగనున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలి

పాల్వంచరూరల్: మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న పొట్లపు హరిప్రియ హైదరాబాద్‌లో జనవరి 5 నుంచి 8 వరకు జరిగిన బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ కై వసం చేసుకుంది. ఈ సందర్భంగా బుధవారం హరిప్రియను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.చిన్నప్పయ్య అభినందించారు. 27వ తేదీన నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపి కళాశాలకు గుర్తింపు తీసుకరావాలని ఆకాంక్షించారు.

ఏపీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా రాంచందర్



నియామకపత్రం అందుకుంటున్న రాంచందర్ నాయక్

టేకులపల్లి: ఏజెన్సీ పరిరక్షణ కమిటీ (ఏపీసీ) క్రమశిక్షణ విభాగం చైర్మన్‌గా టేకులపల్లికి చెందిన ప్రముఖ యువజన నాయకుడు బోడ రాంచందర్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఏపీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు బాణోతు లాల్‌సింగ్ నాయక్ నియామకపు పత్రాలు అందజేసినట్లు రాంచందర్ తెలిపారు. జిల్లాలో అందరినీ సమన్వయం చేసుకుని, నిబద్ధత, క్రమశిక్షణ, చిత్తశుద్ధితో పనిచేసి ఏజెన్సీ ప్రజల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని, తనకు పదవి ఇచ్చిన, సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

జిల్లా సమస్యలపై సీఎం దృష్టి సారించాలి

సింగరేణి(కొత్తగూడెం): సీఎం గురువారం నూతన కలెక్టరేట్‌ను ప్రారంభిస్తున్న సందర్భంగా జిల్లా సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్‌పాషా కోరారు. జిల్లా స్థాయి కార్యాలయాలను ఒకచోటకు తీసుకురావడం అభినందనీయమని ఓ ప్రకటనలో తెలిపారు. అయితే, జిల్లాలో పోడు సమస్య, కొత్త భూగర్భగనుల ఏర్పాటు, ప్రగళ్లపల్లి రిజర్వాయర్, రేళ్లపాడు రిజర్వాయర్ల నిర్మాణం సమస్యలపై సీఎం ప్రకటన చేయాలని కోరారు. పలు సమస్యలపై సీపీఐ తరఫున సీఎంకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు సాబీర్‌పాషా తెలిపారు.

ఆటలతో ఆరోగ్యం, ఆనందం



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

టేకులపల్లి: ఆటలతో ఆరోగ్యం, ఆనందం లభిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగాలు, చదువులతో పాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. బుధవారం బర్లగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఐదు మండలాల స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడి సందడి చేశారు. క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడి ప్రతిభ కనబర్చాలని, జిల్లా , రాష్ట్ర స్థాయిలో రాణించాలని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పాఠాలు, మధ్యాహ్నం భోజనం, చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందుతున్న పోషకాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పూనెం రాంబాబు, మాజీ సర్పంచ్ పూనెం సురేందర్, మోహన్‌రావు, నాయకులు బోడ మంగీలాల్ నాయక్, పోషాలు, గడ్డం మధురెడ్డి పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు



బహుమతులను అందజేస్తున్న ప్రకాశ్

పాల్వంచరూరల్: తెలుగు ప్రజలు ప్రతి సంవత్సరం సంప్రదాయంగా జరుపుకునే సంక్రాంతి పండగకు ముగ్గులు వేయడం సంప్రదాయం.. ఈ సంప్రదాయాన్ని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చలువాది ప్రకాశ్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి పంచాయతీలోని శిశుమందిర్ పాఠశాలలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శిశుమందిర్ స్కూల్ హెచ్‌ఎం.నాగజ్యోతి, వాసవి క్లబ్ ఇంటర్‌నేషనల్ కోర్డినేటర్ పెండ్యాల రోజాలక్ష్మి, వాసవిక్లబ్ బాధ్యులు మల్లేష్, మణి, తేజ, నిర్మల, జి.శ్రీనివాస్, ధనలక్ష్మి, సంతోష్, ఇందిరా, సువర్ణ, పుష్ప పాల్గొన్నారు.

సీఎం సారూ.. స్పందించండి



మాట్లాడుతున్న సతీష్

సింగరేణి(కొత్తగూడెం): ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటన సందర్భంగా జిల్లా సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పట్టణ కార్యదర్శి పెద్దబోయిన సతీష్ డిమాండ్ చేశారు. బుధవారం ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్యుల సమావేశంలో మాట్లాడుతూ.. కొత్తగూడెం నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించాలని, ఇప్పటి వరకు నియోజకవర్గ వ్యాప్తంగా ఒక్క డబుల్ బెడ్ రూం కూడా ప్రజలకు ఇవ్వలేదన్నారు. కలెక్టరేట్ ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి నియోజకవర్గ సమస్యలపై ప్రస్తావించాలన్నారు. నూతన జిల్లాగా ఏర్పడినప్పటి నుంచి ఈరోజు వరకు జిల్లా అభివృద్ధిలో వెనకబడి ఉందన్నారు. జిల్లా ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని సాగునీటి మంచినీటి ఇతరత్రా సమస్యలతోనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నియోజకవర్గంలో బస్టాండ్ శిథిలావస్థకు చేరిందని, నూతన బస్టాండ్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న అనేక సమస్యలపై ముఖ్యమంత్రి స్పందించి పరిష్కారానికి హామీ ఇవ్వాలని కోరారు.

క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలి

టేకులపల్లి: క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని ఖమ్మం జిల్లా టీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధు, మెడికల్ సైన్స్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఈ నెల 5 నుంచి జరుగుతున్న టీపీఎల్ హరిప్రియ కప్ సీజన్2 క్రికెట్ టోర్నమెంట్‌ని ఎమ్మెల్యే బాణోతు హరిప్రియతో కలిసి సందర్శించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ షీల్డ్ అందజేశారు. మ్యాచ్ ప్రారంభానికి టాస్ వేశారు. క్రీడాకారులతో కలిసి ముగ్గురూ బ్యాట్, బౌలింగ్ చేసి సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అతిథులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లెందు నియోజకవర్గంలో ఎమ్మెల్యే హరిప్రియ విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పనకు విశేషంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. భూక్యా రాధ, బోడ సరిత, మాళోతు సురేందర్, భూక్యా బాలకృష్ణ, చింత శాంతకుమారి, లక్కినేని శ్యాం పాల్గొన్నారు.

సీఐటీయూ వినూత్న నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

ఇల్లెందురూరల్: ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో డెయిలీ వేజ్ వర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేయాలని పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ సీఐటీయూ నాయకులు బుధవారం ఇల్లెందులో వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు నబీ, కృష్ణ మాట్లాడుతూ.. 22నెలలుగా వేతనాలు లేకుండా విధులు నిర్వహిస్తున్న కార్మికులు ఆకలితో అలమటిస్తూ ఉద్యమ బాటపడితే పోలీసులు భద్రాచలంలో సంఘం నాయకులను అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. పోలీసుల చర్యలకు నిరసనగా మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈసం పద్మ, యదళ్లపల్లి అంజమ్మ, కుంజ జయ, శైలజ, భద్రమ్మ, దీప, విజయభారతి, అనిత, రాంబాబు, భారతి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థులకు ఉద్యోగాలివ్వాలి

పాల్వంచ: డీఎస్సీ 2008లో నష్టపోయిన బీఈడీ అభ్యర్థులను ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ బుధవారం పాత పాల్వంచలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ బీఎడ్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ లావుడ్యా రవి మాట్లాడుతూ.. హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం త్వరగా ఉద్యోగాలు కల్పించేలా కృషి చేయాలన్నారు. కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి వస్తున్న సందర్భంగా ఈ విషయం ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సావిత్రి, శామ్యూల్, దులియా తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో సంక్రాంతి సందడి



పాల్వంచ: కేఎల్‌ఆర్ విద్యాసంస్థలో ఎడ్లబండిపై అధ్యాపకులు

పాల్వంచ: తెలుగు ప్రజల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని కేఎల్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ కె.నాగమణి అన్నారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి పండుగ సంబురాలు నిర్వహించారు. హరిదాస్, పిట్టల దొర వేషధారణలు అలరించాయి. గంగిరెద్దుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భోగి మంటలు, ఎడ్లబండ్లపై సవారీ నిర్వహించారు. అనంతరం విద్యార్థుల డ్యాన్సులు అలరించాయి. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ.. విద్యార్థులు తెలుగు సంస్కృతి గొప్పదనాన్ని చాటాలన్నారు. డైరెక్టర్లు మురళీ ప్రసాద్, కాశీ విశ్వనాథం, ప్రిన్సిపాల్స్ సురేంద్రకుమార్, పురుషోత్తం, సునిల్ డేవిడ్, సుమన్, సుమతి, నర్సింహారావు, వైస్ ప్రిన్సిపాల్ రమేష్ బాబు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని వివేకవర్ధిని డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థినులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు వైద్యురాలు బిందుపల్లవి బహుమతులను అందజేశారు.

త్రివేణి పాఠశాలలో..

జిల్లాకేంద్రంలోని స్థానిక త్రివేణి పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ముగ్గులు, గాలిపటాల పోటీలే నిర్వహించారు. విజేతలకు డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్ఓ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాససింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కొత్తగూడెంరూరల్: వివేకవర్ధిని డిగ్రీ కళాశాలలో బహుమతులు అందజేస్తున్న డాక్టర్ బిందుపల్లవి



త్రివేణి స్కూల్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

ముందస్తు అరెస్టులు సరికాదు



పాల్వంచ: పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు



జూలూరుపాడు: పోలీసుల అదుపులో నాయకులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అరెస్టులు చేస్తున్నారని ఇలాంటి అరెస్టులకు బీజేపీ కార్యకర్తలు భయపడరని భారతీయ జనతా పార్టీ కార్యదర్శి జోగు ప్రదీప్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో సుదీర్ఘంగా ఉన్న పోడు భూముల సమస్యలపై సీఎం స్పష్టమైన హామీ ఇవ్వాలని, ప్రతి దళితుడికి దళిత బంధు పథకం ఇవ్వాలని, కొత్తగూడెంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం జిల్లా కలెక్టర్ నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి గురువారం సీఎం కేసీఆర్ వస్తున్న నేపథ్యంలో వామపక్ష, ప్రతిపక్ష నాయకులను ముందస్తు అరెస్టులు చేయటం సరైంది కాదని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఖండించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజా సమస్యలపై వినతిపత్రాలు ముఖ్యమంత్రికి విన్నవించుకునే స్వేచ్ఛ లేకుండా ముందుస్తు అరెస్టులు చేయటం అప్రజాస్వామికమన్నారు. వెంటనే ముందస్తు అరెస్ట్ చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

చుంచుపల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం కొత్తగూడెం పర్యటన సందర్భంగా పలు పార్టీలు, ప్రజాసంఘాలకు చెందిన నాయకులను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్ట్ చేశారు. సీఎం పర్యటనలో ఆందోళనలకు దిగే అవకాశం ఉందనే సమాచారంతో చుంచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాంగ్రెస్ నాయకులతో పాటు ప్రజా సంఘాల నాయకులను ఎస్సై సుమన్ అరెస్ట్ చేశారు.

జూలూరుపాడు: సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన గురువారం ఉండటంతో జూలూరుపాడు పోలీసులు పలు పార్టీలు, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులను బుధవారం ముందుస్తుగా అరెస్టు చేశారు. ఎస్ఐ పోటు గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు చెంగల గురునాథం, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ కేశవ్ నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు సిరిపురపు వీరప్రసాద్, ఆదివాసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం నరసింహారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్‌కుమార్‌లను ముందుస్తుగా అదుపులోకి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదుపులోకి తీసుకున్న వారిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గణేష్ బుధవారం పేర్కొన్నారు.

కొత్తగూడెంటౌన్: ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనలో భాగంగా గురువారం కొత్తగూడెం రానుండటంతో బుధవారం కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ముందస్తుగా అరెస్టు చేశారు. వారిలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్, కాంగ్రెస్ నాయకురాలు దేవిప్రసన్న, బీజేపీ నాయకులు ప్రదీప్ అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

పాల్వంచ: ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ, పట్టణ అధ్యక్షులు సూకల రంగారావు, సీనియర్ నాయకులు వీరయ్య చౌదరి, చారి, చంద్రగిరి సత్యనారాయణ, కొండ వెంకన్న గౌడ్‌లను పట్టణ ఎస్ఐలు నరేష్, ప్రవీణ్‌లు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎడవల్లి కృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులకు ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం దుర్మార్గం అన్నారు. సీఎంకు కాంగ్రెస్ పార్టీ అంటే భయం పట్టుకుందన్నారు. కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు. అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామన్నారు.